ప్రజాజ్యోతి
నిజామాబాద్
కామారెడ్డి
సోమవారం । 15 । సెప్టెంబర్ । 2025 । పేజీలు 3

3 చీప్ ట్రిక్‌లు ఆపండి





# గుప్తనిధుల కోసం తవ్వకాలు

## పలువురికి దేహశుద్ధి చేసిన గ్రామస్తులు

## పరారీలో మరికొందరు

బిక్కనూరు సెప్టెంబర్ 14 (ప్రజా జ్యోతి). భిక్కనూరు మండలంలోని సిద్ధ రామేశ్వర ఆలయ సమీపంలో రాగట్లపల్లి గ్రామ పరిధిలో పూర్వం బసవన్న ఆలయం ఉండేది .ఆ గుడి పూర్తిగా శిథిలమైపోయింది. గ్రామస్తులు గ్రామ కమిటీలో ఆలయా నిర్మాణ పనులు చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు. 30 లక్షల వరకు విరాళాల సేకరణ పూర్తయింది గ్రామానికి చెందిన ముగ్గురు ఆదివారం గుడిసె చిన్న భూమయ్య, బొచ్చు మహేందర్ ,దుర్గయ్య లు గుప్త నిధుల కోసం బిక్కనూరు పట్టణానికి చెందిన ఇద్దరు,హైదరాబాద్ పట్టణానికి చెందిన ఇద్దరు వ్యక్తులతో చేతులు కలిపి గుప్తనిధుల తవ్వకాలు ప్రారంభించారు. గమనించిన గ్రామస్తులు వీరందరినీ గ్రామపంచాయతీలో నిర్బంధించి దేహ శుద్ధి చేశారు. .గ్రామానికి చెందిన ఇద్దరు పరారీలో ఉండగా వారి కొరకు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.



# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఎల్లారెడ్డి సెప్టెంబర్ 14 (ప్రజా జ్యోతి) ప్రభుత్వం ద్వారా మంజూరైన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేయడం జరిగిందని ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు అన్నారు.. ఆదివారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎల్లారెడ్డి డివిజన్ పరిధిలోని ఎల్లారెడ్డి నాగిరెడ్డిపేట గాంధారి లింగంపేట మండలాలకు చెందిన సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులైన 59 మందికి 16 లక్షల 95వేల విలువైన సీఎం అఫ్ చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్మోహన్ మాట్లాడుతూ అనారోగ్యం బారిన పడి ఆసుపత్రిలో చికిత్స చేయించుకుని ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా చెక్కులను పంపిణీ చేయడం తనకు వ్యక్తిగత సంతృప్తిని ఇచ్చిందని అన్నారు.

# కన్నతల్లిని కాటికి పంపాడు

## సేవలు చేయలేక హత్య
## కటకటాల పాలైన కొడుకు
## సహకరించిన వ్యక్తి కూడా అరెస్టు
## ఎస్పీ రాజేష్ చంద్ర



కామారెడ్డి ప్రతినిధి సెప్టెంబర్ 14. (ప్రజాజ్యోతి).

అమ్మ ప్రేమకు, త్యాగానికి నిదర్శనం.. మమ్మల్ని సన్మార్గంలో నడిపించే ఒక దిక్సూచి. మన ఉన్నతిని కోరుకునే అపరూప మూర్తి.. అలాంటి అమ్మను వృద్ధాప్యంలో కంటికి రెప్పలా చూసుకోవాలి. కాని ఆమెకు సేవలు చేయలేక .. నదిలో తోసి చంపాడు ఓ ప్రబుద్ధుడు. ఇతడికి సహకరించిన వ్యక్తి సైతం పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఉదంతం బొర్లం గ్రామంలో జరిగింది.

11.09.2025 మధ్యాహ్నం సుమారు 3:00 గంటల సమయంలో బొల్లక్ పల్లి గ్రామ శివారులోని మంజీరా నదిలో గుర్తు తెలియని మహిళ (వయస్సు సుమారు 70-75 సంవత్సరాలు) శవం కనిపించింది. ఈ విషయం పై బొర్లం గ్రామపంచాయతీ కార్యదర్శి గంగుల శివాజీ ఫిర్యాదు మేరకు పిట్లం పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా గుర్తు తెలియని మహిళ శవం ఫోటోలను సీసీ కెమెరా ఫుటేజీలు సేకరించి, వాట్సాప్ గ్రూపులు, సోషల్ మీడియాలో షేర్ చేసి సమాచారాన్ని అందరికీ చేరేలా చేశారు. తేదీ 12.09.2025 నా ఉదయం సుమారు 6 గంటలకు బాన్సువాడ మండలంలోని బోర్లం గ్రామ పెద్దలు ఒక వ్యక్తి ( ఎ - 2 సీసీఎల్ ) ని నువ్వు, ఎర్రోళ్ల బాలయ్య ఇద్దరు కలిసి సాయవ్వను ఆస్పత్రికి తీసుకెళ్లినరు కదా ఏమైనధి అని అడుగగా ధానికి అతను గ్రామ పెద్దమనుషులకు హత్య జరిగిన విధానాన్ని వివరించాడు. ఎర్రోళ్ల బాలయ్య ( 46 సంవత్సరాలు ) తన తల్లి సాయవ్వ ( 77 సంవత్సరాలు ) ఆరోగ్యం బాగాలేదని, ఇంట్లోనే పడుకున్న దగ్గర మల మూత్ర విసర్జన చేస్తున్నది, ఇంట్లో చూసుకోవడానికి ఎవరూ లేరని, ఇల్లు వాసన వస్తోందని చెప్పి తేది 08.09.2025 రాత్రి 9:00 గంటల సమయంలో తన బైక్‌పై బొల్లక్ పల్లి బ్రిడ్జి వద్దకు తీసుకెళ్లి, బ్రిడ్జ్ మీద నుండి మంజీర నదిలోకి తోసివేసి హత్య చేసినాము అని తెలిపాడు. తేది 14.09.2025 న నమ్మదగిన సమాచారంపై బాన్సువాడ మండలంలోని కొయ్యగుట్ట చౌరస్తా వద్ద నిందితులు ఎ - 1. ఎర్రోళ్ల బాలయ్య , ఎ - 2. సీసీఎల్ బోర్లం నుండి కొయ్యగుట్ట కు వస్తుండగా అరెస్టు చేసి, హత్యలో ఉపయోగించిన బైక్, రెండు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఎర్రోళ్ల బాలయ్యను రిమాండ్‌కు తరలించారు. జువేలైన్ బాలుడును జువెనేల్ అబ్జర్వేషన్ హోం కు తరలించడం జరిగిందన్నారు.హత్య కేసు చేదనలో బాన్సువాడ డిఎస్పి విటల్ రెడ్డి, పర్యవేక్షణలో బాన్సువాడ రూరల్ సీఐ తిరుపతయ్య, పిట్లం ఎస్ఐ వెంకట రావు, సిబ్బందిని జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర అభినందించి నేరం చేసిన వ్యక్తులు ఎవరైనా చట్టం నుండి తప్పించుకోలేరని జిల్లా ఎస్పీ అన్నారు.



## ప్రభుత్వ జూనియర్ కళాశాలకు( కో ఎడ్) ప్రొజెక్టర్ అందజేత

బాన్సువాడ టౌన్ ప్రజా జ్యోతి సెప్టెంబర్14 బాన్సువాడ మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్ల సంఖ్య పెరిగిన నేపథ్యంలో, గ్రామీణ ప్రాంత విద్యార్థులు కూడా డిజిటల్ విద్యా సౌకర్యాలు పొందాలని, పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరచాలని లక్ష్యంగా చతుర్వేది అభినవ (సర్కిల్ ఇన్స్పెక్టర్, హైదరాబాద్), సంజీవ్ (సర్కిల్ ఇన్స్పెక్టర్, హైదరాబాద్), సాజిద్ (జోనల్ ఇన్స్పెక్టర్ నిజామాబాద్) ముగ్గురు అధికారులు కలిసి కళాశాలకు రూ.30,000 విలువ గల ప్రొజెక్టర్‌ను అందజేశారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు చిన్న వయసులోనే పెద్ద లక్ష్యాలను ఏర్పరచుకోవాలి. కష్టపడి చదివితే గ్రామీణ విద్యార్థులు కూడా రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించగలరు. డిజిటల్ విద్యను సద్వినియోగం చేసుకొని జ్ఞానాన్ని పెంపొందించుకొని, భవిష్యత్తులో ఉన్నత స్థానాలను సాధించాలి అని సూచించారు.

ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మరియు నోడల్ ఆఫీసర్ షేక్ సలాం , ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ శివకుమార్ సార్, సీడీసీ సభ్యులు ఏజాజ్ , దాసరి శ్రీనివాస్ , అధ్యాపకులు సురేష్ సార్,నరేష్ సార్,బాబా సాహెబ్ సార్, వజహత్ సార్,శంకర్ సార్ విద్యార్థులు పాల్గొన్నారు. అధికారుల సహకారంతో తమకు విలువైన డిజిటల్ సదుపాయం లభించినందుకు విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తూ, వారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ



రాజంపేట సెప్టెంబర్ 14 (ప్రజా జ్యోతి). ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని రాజంపేట మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు చెక్కులను పంపిణీ చేశారు. కామారెడ్డిలోని లక్ష్మీదేవి గార్డెన్లో జరిగిన ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు త్వరగా అందేలా చర్యలు తీసుకున్నందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్ర ప్రణీత్ రెడ్డి, మండల కమిటీ సభ్యులు, సీనియర్ నాయకులు, గ్రామాల అధ్యక్షులు, యువజన అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

లబ్ధిదారులకు తహసీల్దార్ రేణుక చౌహన్ చేతుల మీదుగా చెక్కులు అందజేత

గాంధారి, సెప్టెంబర్ 14 (ప్రజాజ్యోతి). ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. గాంధారి మండలంలోని నేరల్ తాండకు చెందిన లబ్ధిదారులకు చెక్కులను స్థానిక తహసీల్దార్ రేణుక చౌహన్ అందజేశారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు ఎమ్మెల్యే మదన్ మోహన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేరల్ తాండ కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు బస్సీ బంతియా, పలువురు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# మరమ్మతులకు నోచని గ్రామీణ రోడ్లు

భిక్కనూరు సెప్టెంబర్ 14 (ప్రజా జ్యోతి) . భిక్కనూరు మండలం లోని మొటట్ పల్లి, ఆరేపల్లి తలమడ్ల గ్రామాలకు వెళ్లే దారి గత 15 రోజుల క్రితం కురిసిన వర్షాల కారణంగా దారి పూర్తిగా ధ్వంసం అయిపోయి వాహనాలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు .ఇందులో భాగంగా రాత్రి అనారోగ్యం కారణంగా మోటాట్ పల్లి నుండి బిక్కనూర్ కు చికిత్స కోసం వస్తున్న కొంతమంది ప్రయాణ సమయంలో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొని వారి సమస్యను "ప్రజా జ్యోతి" పత్రిక ద్వారా అధికారులకు తెలియజేయాలని విన్నవించుకున్నారు.ఈ కథనంతో స్పందించి అధికారులు తక్షణమే రోడ్డు మరమ్మత్తు పనులు చేపట్టాలని గ్రామస్తులు కోరారు.





## కంటి చూపు కోల్పోయిన బాలుడికి జగ్గారెడ్డి అండ

గాంధారి సెప్టెంబర్ 14 (ప్రజాజ్యోతి). కంటి చూపు కోల్పోయిన బాలుడికి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అండగా నిలిచారు. కామారెడ్డి జిల్లాలోని గాంధారి మండల లొంకా తాండకు చెందిన వికాస్ అనే బాలుడు చికిత్స కోసం కుటుంబం అప్పుల పాలై ఇబ్బందులు పడుతున్న సంగతి తెలిసిన జగ్గారెడ్డి వెంటనే స్పందించారు.వికాస్ తల్లిదండ్రులు కంటి చూపు చికిత్స కోసం లక్షలాది రూపాయలు అప్పు చేశారని, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బాలుడు జగ్గారెడ్డికి తెలిపాడు. దీనిపై స్పందించిన మాజీ ఎమ్మెల్యే రూ.7 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. అదనంగా వికాస్‌కు స్మార్ట్‌ఫోన్‌ను కొనిచ్చి భవిష్యత్తులో యూట్యూబ్ ఛానల్ పెట్టిస్తానని భరోసా ఇచ్చారు.జగ్గారెడ్డి సహకారంతో తనకు తిరిగి ఆశ కలిగిందని వికాస్ కృతజ్ఞతలు తెలిపారు.

## కస్తూర్బా పాఠశాలలో హిందీ దివస్ వేడుకలు

రాజంపేట, సెప్టెంబర్ 14 (ప్రజా జ్యోతి). రాజంపేట మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో ఆదివారం హిందీ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి శ్రీవాణి మాట్లాడుతూ హిందీ భాష రాజభాషగా గుర్తింపు పొందిందని, ప్రతి విద్యార్థి దానిని నేర్చుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. అనంతరం హిందీ అధ్యాపకులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## బాధితుడికి అండగా నిలిచిన మాజీ ఎమ్మెల్యే



గాంధారి సెప్టెంబర్ 14 (ప్రజాజ్యోతి)గాంధారి మండలంలోని మేడిపల్లి గ్రామానికి చెందిన మహ్మద్ శంషుద్దిన్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ప్రస్తుతం హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆసుపత్రికి వెళ్లి శంషుద్దిన్‌ను పరామర్శించారు.క్షతగాత్రుడిని ఆప్యాయంగా మాట్లాడి ధైర్యం చెప్పిన సురేందర్, "అండగా నేనున్నాను" అని భరోసా ఇచ్చారు. అనంతరం అక్కడి వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని సూచించారు.ఈ సందర్భంగా ఆయనతో పాటు నాయకులు శ్రీనివాస్ నాయక్, సదాశివనగర్ మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.





## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

సదాశివనగర్ సెప్టెంబర్ 14 (ప్రజాజ్యోతి). సదాశివనగర్ మండలం ఉత్తునూర్ ఉన్నత పాఠశాల 2001-2002 వ సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు 23 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు పుష్పగుచ్ఛం అందజేసి మెమంటో ఇచ్చి శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. పాఠశాలలో ఆడిన ఆటలు, తరగతి గదిలో చేసిన అల్లర్లు అప్పటి అనుబంధం తీపి గుర్తులు గుర్తు తెచ్చుకున్నారు. ఎవరు ఏం చేస్తున్నారో ఏ ఉద్యోగాలలో స్థిరపడ్డారో ప్రస్తావించుకున్నారు. ఒకరికొకరు మాట్లాడుకుంటూ చిన్ననాటి తీపి గుర్తులు నెమరు వేసుకున్నాను. ఇలాగే అందరూ సమిష్టిగా ఉండి మీ ఐక్యతను చాటి ఉన్నత స్థాయిలో స్థిరపడాలని ఉపాధ్యాయులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు



## బదిలీపై వెళ్లిన ఐకేపీ సీసీకి సన్మానం

నాగిరెడ్డి పేట్(లింగంపేట),సెప్టెంబర్14(ప్రజాజ్యోతి): లింగంపేట్ మండలంలోని శెట్పల్లి సంగారెడ్డి క్లస్టర్ లో ఐకేపీ సీసీ గా పనిచేసిన నజీర్ కు సజ్జనపల్లి గ్రామస్థులు ఘనంగా వీడ్కోలు సన్మానం నిర్వహించారు. 2015 సంవత్సరంలో గ్రామానికి సీసీ బాధ్యతలు చేపట్టిన నజీర్ పది సంవత్సరాలు సమర్థవంతంగా సేవలందించిన అనంతరం బదిలీపై నాగిరెడ్డిపేట్ మండలానికి వెళ్లిన సందర్భంగా సజ్జనపల్లి గ్రామానికి చెందిన వివోఏ సాయిలు తో పాటు యువకులు శాలువాలతో సన్మానించి,సేవల్ని గుర్తించి కృతజ్ఞతలు తెలిపారు.



## చీప్ ట్రిక్‌లు ఆపండి

మోర్తాడ్ సెప్టెంబర్ 14(ప్రజా జ్యోతి) మంత్రిగా పనిచేసిన ప్రశాంత్ రెడ్డి యూరియా సరాఫరా విషయంలో అవగాహన కోల్పోయి మాట్లాడుతున్నారని, చీప్ ట్రిక్కులు ప్లే చేసుకుంటూ ప్రజల్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్చార్జ్ ముత్యాల సునీల్ రెడ్డి అన్నారు. ఆదివారం మోర్తాడ్ లోని ప్రజా నిలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రశాంత్ రెడ్డి ఆరోపణలపై ఘాటుగా విమర్శించారు. యూరియా విషయంలో రైతులెవరు ఆందోళన చెందవద్దని కావలసినంత యూరియా అందుబాటులోకి వస్తుందని, యూరియా విషయంలో ప్రభుత్వాన్ని కావాలనే బదునం చేస్తున్నారని, మంత్రిగా పనిచేసిన ప్రశాంత్ రెడ్డికి జిల్లాలో ఎంత యూరియా అవసరమో ఇప్పటివరకు ఎంత సరాఫరాయిందో కూడా కనీస అవగాహన లేదు అని అన్నారు. 2022-23 సంవత్సరంలో నిజామాబాద్ జిల్లాకు 27,782 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా జరిగింది. 2023-2024 సంవత్సర కాలంలో నిజామాబాద్ జిల్లాకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దాదాపు 35 వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా జరిగింది. 2024-2025 సంవత్సరకాలంలో ఇప్పటివరకు 42,000 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా జరిగిందన్నారు. అదే బాల్కొండ నియోజకవర్గంలో 2022-23 సంవత్సరకాలంలో 7181 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా జరిగిందని అలాగే 2023-24 సంవత్సర కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 9861 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా జరిగిందని అన్నారు. 2024-2025 సంవత్సర కాలంలో 11247 మెట్రిక్ టన్నుల యూరియా ఇప్పటివరకు సరఫరా చేయడం జరిగిందని తెలిపారు. ఈ విషయాన్ని గమనించి బాధ్యతాయుతమైన పదవులలో ఉన్నవారు ప్రజలను అయోమయానికి గురి చేయకుండా ఉంటే మంచిది అని ఆయన అన్నారు. ఈ సమావేశంలో ఆయా మండలాల కాంగ్రెస్ అధ్యక్ష కార్యదర్శులు నాయకులు పాల్గొన్నారు

## ఐక్యంగా ఉంటేనే హక్కుల సాధన

బాన్స్ వాడ టౌన్ ప్రజా జ్యోతి సెప్టెంబర్ 14. గ్రామస్థాయి నుండి జాతీయ స్థాయి వరకు వడ్డెర సంఘమును బలోపేతం చేద్దాం ఐక్యంగా ఉంటేనే మన హక్కులు సాధిస్తాం జాతీయ వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షులు పిట్ల శ్రీధర్ హైదరాబాద్ అత్తాపూర్ లోని జాతీయ వడ్డెర సంఘం కార్యాలయంలో పలువురికి సంఘ బాధ్యతలు అప్పగిస్తూ నియామక పత్రాలు అందజేసిన జాతీయ వడ్డెర సంఘం అధ్యక్షులు పిట్ల శ్రీధర్ వారితోపాటు పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షులు వల్లెపు శివకుమార్ , జాతీయ గౌరవాధ్యక్షులు రూపాని లోకనాథం , జాతీయ కార్యదర్శి బత్తుల లక్ష్మీకాంతయ్య జాతీయ యువజన అధ్యక్షులు వేముల భరత్ జాతీయ సహకార్యదర్శి పల్లపు రమేష్ అనంతరం జాతీయ అధ్యక్షులు పిట్ల శ్రీధర్ మాట్లాడుతూ జాతీయ వడ్డెర సంఘం ప్రతి వడ్డెర బిడ్డ కు నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం అందాలని, ప్రతి వడ్డెరకు సామాజిక భద్రత కలిగించాలని, ఆర్థికం గా, రాజకీయం గా వడ్డేరులు ఎదగాలి అనే అంశాలపైన పోరాటం చేస్తుందని, ప్రభుత్వం నుండి ఇవన్నీ మన వడ్డెరలకు సమకూరాలంటే గ్రామీణ స్థాయి నుండి జాతీయ స్థాయి వరకు మనందరం కూడా మన వారిని చైతన్య పరుస్తూనే మన వడ్డెర ప్రజల పక్షాన పోరాటం చేయాలని తెలిపారు. సంఘం బాధ్యతలు తీసుకున్నవారి జాతీయ మహిళా సంఘం ఉపాధ్యక్షురాలుగా చెంబేటి విజయలక్ష్మి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలుగా వేముల భవాని, గ్రేటర్ హైదరాబాద్ మహిళా అధ్యక్షురాలుగా మక్కల ధనలక్ష్మి, జాతీయ వడ్డెర సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులుగా బోదాసు రవి, రాష్ట్ర కార్యదర్శిగా దేరంగుల రామచంద్రయ్య ను నియమించడం జరిగింది.

# స్పోర్ట్స్ దుస్తులు వితరణ చేసిన రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి



నిజామాబాదు రూరల్: సెప్టెంబర్, 14 (ప్రజా జ్యోతి). స్పోర్ట్స్ దుస్తులు వితరణ చేసిన రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి. ఆదివారం జిల్లా కేంద్రం బైపాస్ రోడ్ లో గల ఎమ్మెల్యే క్యాంపస్కార్యాలయంలో సిరికొండ మండలంలో గల గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు జిల్లా యూత్ నాయకులు ఉమ్మాజి నరేష్ ఆధ్వర్యంలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి స్పోర్ట్స్ దుస్తులను విద్యార్థులకు వితరణ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ.. గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు అన్ని రకాలుగా ప్రభుత్వం ఆదుకుంటుందని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కాస్మోటిక్ చార్జీలు పెంచామని అన్నారు. నాణ్యమైన విద్యతోపాటు, నాణ్యమైన ఆహారం పెడుతున్నామని, ముఖ్యంగా శారీరక దృఢత్వం ఉండడానికి స్పోర్ట్స్, గేమ్స్‌లో ప్రత్యేకంగా చొరవ తీసుకుంటున్నామని అన్నారు. రాష్ట్రస్థాయి, నేషనల్ స్థాయిలో ఆటలు ఆడి రాష్ట్రానికి, జిల్లాకు, గిరిజన పాఠశాలకు, నిజామాబాద్ రూరల్ నియోజవర్గానికి మంచి పేరు తేవాలని అన్నారు. సిరికొండ గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులు వివిధ స్పోర్ట్స్ గేమ్స్ లో రాష్ట్ర స్థాయి వరకు వెళ్లారని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యూత్ కాంగ్రెస్ నాయకులు గోపి, గిరిజన ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు భోజరాం, ఫిజికల్ డైరెక్టర్ ప్రశాంత్, ఉపాధ్యాయులు సంజీవ్, ఫీల్డ్ అసిస్టెంట్ గణేష్, రాజేశ్వర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పోచారం ప్రాజెక్టులో పడి యువకుడు మృతి..





నాగిరెడ్డి పేట్,సెప్టెంబర్14(ప్రజాజ్యోతి): ప్రమాదవశాత్తు పోచారం ప్రాజెక్టులో పడి యువకుడు మృతి చెందిన ఘటన నాగిరెడ్డిపేట్ మండలంలోని పోచారం ప్రాజెక్ట్ వద్ద చోటుచేసుకుంది. ఏఎస్సై మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం మెదక్ జిల్లా కేంద్రంలోని అజంపుర కాలనీకి చెందిన షేక్ మహబూబ్ (20),తన స్నేహితుడు వాసిమ్ తో కలిసి ఆదివారం సాయంత్రం పోచారం ప్రాజెక్టు కు సరదాగా గడిపేందుకు వచ్చిన ప్రాజెక్ట్ అలుగు పై నుంచి నీరు పారుతుండడంతో,ప్రాజెక్ట్ దిగువన నీటిలో ఈత కొట్టడానికి వెళ్లారు.కాగా మహబూబ్ ఈత కొడుతూ ముందుకు వెళ్లి ఊపిరాడక నీటమునిగిపోవడంతో అక్కడే ఉన్న స్థానికులు నాగిరెడ్డిపేట పోలీసులకు సమాచారం అందించడంతో ఘటన స్థలానికి పోలీసులు చేరుకొని గజ ఈతగాళ్లతో నీట మునిగిన మహబూబ్ మృతదేహాన్నిబయటకు తీసినట్లు తెలిపారు.మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తము మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఏఎస్సై మధుసుధన్ తెలిపారు.

## ఏఐబీఎస్ఎస్ యూత్ అధ్యక్షుడిగా మాలోత్ గణేష్ నాయక్



ఎల్లారెడ్డి, సెప్టెంబర్ -14 (ప్రజా జ్యోతి ) ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం ఎల్లారెడ్డి మండల నూతన యూత్ కమిటీని ఆదివారం ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ మండల అధ్యక్షులు ఖోల రాములు నాయక్, మండల బంజారా ఉద్యోగుల కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఆల్ ఇండియా బంజారా సంఘ్ మండల యూత్ అధ్యక్షుడిగా మాలోత్ గణేష్ నాయక్, ప్రధాన కార్యదర్శిగా ఖోల సేవ్య, గౌరవ అధ్యక్షులుగా సభావత్ జీవన్, ఉపాధ్యక్షులుగా మాలోత్ సుభాష్, సహాయ కార్యదర్శులుగా అంగోత్ రాజేందర్, మెగావత్ సంతోష్, కోశాధికారులుగా ధనవాట్ బన్సీలాల్, సభావత్ సంగ్రామ్, ప్రచార కమిటీ సభ్యులుగా ధనవత్ రాంజీ, ప్రధాన సలహాదారులుగా ధరావత్ విజయ్, రత్నావత్ లచ్చిరామ్, క్రీడా కార్యదర్శిగా సభావాత్ కుమార్, సంస్కృతిక కార్యదర్శిగా ధనావత్ బన్సీలాల్, ధరావత్ ప్రేమ్ సింగ్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. నూతనంగా ఎన్నికైన కమిటీలు బంజారాల అభ్యున్నతి కోసం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగిరెడ్డిపేట్ మండల బంజారా సేవా సంఘం అధ్యక్షులు రమేష్ నాయక్, బంజారా నాయకులు చందర్ నాయక్, పూల్ సింగ్ నాయక్, సర్దార్ నాయక్, గోవింద్ నాయక్, లాల్ సింగ్ నాయక్, వివిధ తండాల యువకులు తదితరులు పాల్గొన్నారు.

## సాటాపూర్‌లో కరెంటు కోతలు తీవ్రతరం

రెంజల్, సెప్టెంబర్ 14 ( ప్రజాజ్యోతి ): రెంజల్ మండల కేంద్రంలోని సాటాపూర్ గ్రామంలో చీకటైతే చాలు కరెంటు కష్టాలు మొదలవుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ చీకటైతే చాలు తమ గ్రామంలో గంటల తరబడి కరెంటు పోతుందని విధ్యుత్ శాఖ సిబ్బంది కి పలు మార్లు తమ గోడును విన్నవించిన పట్టించుకునే నాధుడే లేడని వాపోతున్నారు. గ్రామంలో గంటల తరబడి కరెంటు పోతున్న విద్యుత్ శాఖ సిబ్బంది అందుబాటులో లేకపోవడం గమనిగ్రహం అని అసలు గ్రామంలో కరెంటు పోతె ఎవరికి చెప్పుకోవాలో కూడా దిక్కు తోచని స్థితిలో గ్రామస్తులు ఉన్నారని తమ గోడు విన్నవించిన పై అధికారులు స్పందించలేకపోవడం విడ్డురం అని ఇప్పటికైనా ఈ సమస్యకు తగిన పరిష్కారం చేయాలని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

